క్లుప్తంగా

మట్కా, పేకాటపై ప్రత్యేక నిఘా

యల్లనూరు: మండలవ్యాప్తంగా మట్కా, పేకాట తదితర జూదాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఎస్ఐ రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ఎస్ఐ విలేకరులతో మాట్లాడారు. మండలంలో ఎక్కడైనా మట్కా, పేకాట ఆడుతుంటే సమాచారం ఇవ్వాలన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పుట్లూరు: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ వెంకటప్రసాద్ సూచించారు. శుక్రవారం ఆయన ఎ.కొండాపురంలో తాడిపత్రి–అనంతపురం ప్రధాన రోడ్డుపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించడంతో పాటు లైసెన్స్ ఉన్న వారు మాత్రమే వాహనాలను నడపాలన్నారు.

కసాపురంలో నేడు రథసప్తమి వేడుకలు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో శనివారం రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో దొడ్డ వెంకటేశ్వరరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రథసప్తమి సందర్భంగా ఉదయం 7.30 గంటలనుంచి ఆలయంలో సూర్యనారాయణ స్వామి యంత్ర ఆరాధనలు, ప్రత్యేక పొంగలి నివేదన, సామూహిక సూర్యనమస్కారములు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఉత్తమ అవార్డు గ్రహీతకు సన్మానం

యాడికి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం ఏఓ మహబూబ్ బాషా కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏఓను సిబ్బంది, ఫర్టిలైజర్ దుకాణదారులు వెంకట్, సూరి, కులశేఖర్‌రెడ్డి, భీముడు, ధనంజయ, ప్రకాష్, చంద్ర, శ్రీకాంత్, రాము తదితరులు పూలమాల, శాలువాతో సత్కరించారు.

గుంతకల్లు రూరల్: గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ చేతుల మీదుగా ప్రతిభా అవార్డు పొందిన వీఆర్వో శివకుమార్‌ను శుక్రవారం తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా తహసీల్దార్ రాము ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది ఆయనను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

సీసీరోడ్డు నిర్మాణం ప్రారంభం

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లో శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర, చైర్‌పర్సన్ వన్నూర్‌బీలు సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఆర్ఎస్‌లోని ఉజ్వల నర్సింగ్ హోమ్ నుంచి పాత పంచాయతీ కార్యాలయం వరకు రోడ్డు నిర్మించనున్నారు. రెండు రోజుల్లో పనులు పూర్తి చేయాలని కమిషనర్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



భోజనం వడ్డిస్తున్న ఆలూరు రమణారెడ్డి తదితరులు

బుక్కరాయసముద్రం: ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో గ్రామాల్లో ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఆలూరు రమణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గుజ్జల సరళాదేవినగర్‌లో బొడ్రాయి ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆలూరు రమణారెడ్డి, మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి హాజరై మాట్లాడారు. రోటరీపురం, చెదుల్ల, బాట్లో కొత్తపల్లి, బీకేఎస్‌లో జన చైతన్య నగర్ కాలనీల్లో ఆలయాల నిర్మాణాలకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం ఆలూరు రమణారెడ్డి అన్నదానాన్ని ప్రారంభించారు. కాలువ నారాయణస్వామి, బుల్లే రాజా, శేషానందరెడ్డి, పుష్ప, ప్రసాద్, లక్ష్మీరాయణ, సీపీఐ నాయకులు జాఫర్, మద్రిస్వామి, వెంకట్ పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం



వ్యక్తిని అరెస్టు చూపుతున్న సెబ్ పోలీసులు

గుంతకల్లు: హంద్రీనీవా కాలువ సమీపంలో ఓ వ్యక్తిని అరెస్టు చేసి 40 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ మహేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దాడుల్లో భాగంగా హంద్రీనీవా కాలవపై గస్తీ నిర్వహిస్తుండగా బ్రిడ్జి సమీపంలో కర్నూలు జిల్లా మద్దికెరకు చెందిన ఎరికల కావేటి శ్రీనివాసులు గుంతకల్లు వైపునకు బైక్‌పై నాటుసారా తరలిస్తూ పట్టుబడ్డాడన్నారు. బైక్, నాటుసారా స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

ఉత్సాహంగా ప్రజా సంక్షేమయాత్ర



లక్ష్మంపల్లి వద్ద పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దవడుగూరు : తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేపట్టిన ప్రజా సంక్షేమ యాత్ర రెండో రోజు ఉత్సాహంగా సాగింది. అశేష జనవాహిని మధ్య విరుపాపురంలో ఉదయం 9 గంటలకు ప్రారంభమైంది. విరుపాపురం నుంచి 4 కిలో మీటర్లు జి. వెంకటాంపల్లి వరకూ సాగింది. గ్రామం సమీపానికి యాత్ర చేరుకోగానే మహిళలు ఎమ్మెల్యేకు హారతిపట్టి పూలమాలలు వేసి ఆప్యాయంగా గ్రామంలోకి ఆహ్వానించారు. ఒక బాలుడు చేతితో జెండా పట్టుకుని పెద్దాయన తో కలిసి అడుగులు వేయడంతో ఆకర్షించింది. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఎమ్మెల్యే యాత్ర సాగుతుండగా కొందరు వృద్ధులు ఆయన వద్దకు వచ్చి చల్లగా ఉండాలని దీవించారు. అక్కడి నుంచి మల్లేనిపల్లికి యాత్ర సాగింది. మధ్యాహ్నం గ్రామం సమీపంలో భోజన విరామం తీసుకున్నారు. ఈసందర్భంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే అందరినీ అడిగి తెలుసుకొన్నారు. యాత్రకు జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సర్ సీవి రామన్ విద్యాసంస్థల అధినేత భాస్కర్‌రెడ్డి, రైతు సంఘాల నేత తరిమెల గోకుల్‌నాథ్‌రెడ్డి ఎమ్మెల్యేతో కలిసి అడుగులు వేశారు. 3 గంటలకు యాత్ర మల్లేనిపల్లికి చేరుకోవడంతో గ్రామస్తులు పూలవర్షం కురిపిస్తూ హారతులతో స్వాగతం పలికారు. సర్పంచ్ రూపానాగరాజ్, గ్రామపెద్దల సహకారంతో ఏర్పాటు చేసిన మారుతీ చారిటబుల్ ట్రస్ట్ వాటర్ ప్లాంటును ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామాలను ఆదర్శవంతం గా మార్చడానికి ఎలాంటి సాయం చేయడానికైనా సిద్ధమేనని హామీ ఇచ్చారు. అనంతరం యాత్ర లక్ష్మంపల్లి వరకూ సాగింది. యాడికి, పెద్దపప్పూరు, తాడిపత్రికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు తరలివచ్చి సంఘీబావం తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గూడూరు సూర్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి, జడ్పీటీసీభాస్కర్‌రెడ్డి, నాయకులు కృష్టారెడ్డి, పాశం రంగస్వామి, వసంతమాళేశ్వరి, షరీఫాయాదవ్, లక్కు రామచంద్రారెడ్డి, వెంకటస్వామిగౌడ్, శేషారెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు యాపర్ల కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో జనం సుభిక్షం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

● ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

శింగనమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. మండలంలోని చిన్నజలాలపురం గ్రామంలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరత్నాలు, సంక్షేమ పథకాలతో ముఖ్యమంత్రి జగనన్న రాష్ట్రంలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికారన్నారు. ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేశారని, వాటిని అభివృద్ధి పనులు చేస్తామన్నారు. కుల, మత, పార్టీ భేదాలు లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ప్రభుత్వ సేవలను ప్రజల గడప వద్దే అందిస్తున్నామని గుర్తు చేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాఉల, ఎరువులు గ్రామాల్లోనే అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఫ్యామిలీ ఫిజీయన్ కార్యక్రమం ద్వారా దీర్ఘకాలి వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇంటి వద్ద వైద్యం అందించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ నిర్మలాకుమారి, ఎంపీపీ యోగేశ్వరి, ఎంపీటీసీ కురుబ ఉమా, సర్పంచ్ వెంకట్రాముడు, గాండ్ల కార్పొరేషన్ డైరెక్టర్ నరసయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు తరిమెల భాస్కర్‌రెడ్డి, పట్నం నగేష్, ఎస్‌వీ నారాయణ, బండి శ్రీనివాసులు, రామకృష్ణారెడ్డి, ఆదిరెడ్డి, బండి లలిత కళ్యాణి, శంకుతలమ్మ పాల్గొన్నారు.

సేవాలాల్ జయంత్యుత్సవాలు జయప్రదం చేద్దాం



మాట్లాడుతున్న గుంతకల్లు డీఎస్పీ నర్సింగప్ప

గుత్తి రూరల్: చెర్లోపల్లి పంచాయతీలోని సేవాఘడ్‌లో ఫిబ్రవరి 13, 14, 15 తేదీల్లో జరగనున్న సంత్ సేవాలాల్ మహరాజ్ 284వ జయంత్యుత్సవాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేద్దామని డీఎస్పీ నరసింగప్ప, ఆర్డీఓ రవీంద్ర, డీటీడబ్ల్యూఓ అన్నాదొరై పేర్కొన్నారు. శుక్రవారం సేవాఘడ్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో సేవాలాల్ జయంతి ఉత్సవ ఏర్పాట్లపై సేవాఘడ్ ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవనాయక్, ప్రధాన కార్యదర్శి అశ్వత్థనాయక్, తహసీల్దార్ మహబూబ్ బాషా ఇతర మండల అధికారులతో కలిసి , ఆర్డీఓ, డీఎస్పీలు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవాలాల్ జయంత్యుత్సవాలకు భక్తులు భారీగా వస్తారని వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గుత్తి, గుంతకల్లు, వజ్రకరూరు, ఉరవకొండల నుంచి బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ అధికారులకు ఆదేశించారు. భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, తాత్కాలికంగా స్నానపు గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. ఆయా శాఖల అధికారులందరూ ఫిబ్రవరి 13 నుంచి 15 వరకు సేవాఘడ్‌లోనే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కల్గినా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ హెచ్చరించారు. ఉత్సవాల సందర్భంగా సమీప గ్రామాల్లో నాటు సారా అమ్మకాలు జరగకుండా చూడాలని సెబ్ అధికారులకు ఆదేశించారు. త్వరలో మరోసారి సమీక్ష ఉంటుందని, కలెక్టర్ వచ్చే అవకాశాలున్నాయని అందుకు ప్రతి అధికారి ప్రణాళికలను తయారు చేసుకోవాలని డీటీడబ్ల్యూ అన్నాదొరై, ఆర్డీఓ రవీంద్ర తెలిపారు. అనంతరం సేవాలాల్ మహరాజ్, మాతా జగదాంబ ఆలయంలో అధికారులు ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ అప్పా వెంకటేష్, ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవనాయక్, ప్రధాన కార్యదర్శి అశ్వత్థనాయక్, రవీంద్రనాయక్, సభ్యులు ఠాగూర్‌నాయక్, శేఖర్‌నాయక్, గుంతకల్లు ఫైర్ ఆఫీస్ లింగమయ్య, ఈఓఆర్డీ శివాజీరెడ్డి, సీడీపీఓ నాగమణి, సూపర్‌వైజర్ నాగేశ్వరి, ప్రియాంక, ఎస్ఐ శ్రీనివాసులు, ఏఈ శ్రీకుమార్ పాల్గొన్నారు

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం



యాడికి : చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ రామకృష్ణ

యాడికి: విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరమని పామిడి రూరల్ సీఐ రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం వేములపాడు వద్ద ఉన్న కేజీబీవీలో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, విద్యాహక్కు చట్టం, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, చైల్డ్ లేబర్, సైబర్ నేరాల గురించి వివరించారు. అత్యవసర సమయాల్లో పోలీసులకు, లేదా 100కు ఫోన్ చేయాలని సూచించారు. కేజీబీవీ ఎస్ఓ నిర్మల, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

యల్లనూరు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎస్ఐ రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం కస్తూర్బా బాలికా విద్యాలయంలో ఎస్ఐ రామకృష్ణ విద్యార్థినులకు బాల్యవివాహాలు, సైబర్ క్రైమ్, ఆపద సమయంలో 100 ఎలా ఉపయోగించాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి మాధవి, ఏఎస్ఐ శ్రీనివాసులగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాద రహిత డిపోగా మార్చండి



మాట్లాడుతున్న డీఎస్పీ చైతన్య

తాడిపత్రిటౌన్ : తాడిపత్రి ఆర్టీసీ డిపోను ప్రమాద రహితంగా మార్చాలని డీఎస్పీ చైతన్య ఆర్టీసీ సిబ్బందికి పిలుపునిచ్చారు. స్థానిక ఆర్టీసీ గ్యారేజీలో డిపో మేనేజర్ శంకర్ అధ్యక్షతన రోడ్డు భద్రతా వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ చిరునామా అనే ప్రయాణికుల నమ్మకాన్ని నెలబెట్టుకునేలా ఆర్టీసీ కార్మికులు పని చేయలన్నారు. డ్రైవర్లపై పని వత్తిడి లేకుండా చూడాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని ట్రాఫిక్ సీఐ గుప్తా ఆర్టీసీ డ్రైవర్లకు సూచించారు. ఎంవీఐ రాజగోపాల్, ఎంయఫ్ సత్యనారాయణ, డిప్యూటీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పుల్లయ్య, డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ వలి, ఆర్టీసీ కార్మిక సంఘ నేతలు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని డీఎస్పీ నర్సింగప్ప తెలిపారు. శుక్రవారం స్థానిక గాయత్రీ ఫంక్షన్‌హాల్‌లో కాలేజీ విద్యార్థులకు రోడ్డు భద్రతా నియయాలపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్లనే అధిక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మైనర్ బాలలకు వారి తల్లిదండ్రులు ద్విచక్రవాహనాలు ఇచ్చి పంపడం నేరమన్నారు. డ్రైవింగ్ లైసెన్సులు కలిగిన వారు మాత్రమే వాహనాలు నడపాలన్నారు. వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సాలాబాయి, సరస్వతీ కళాశాల ప్రిన్సిపాల్ జోసెఫ్, వన్‌టౌన్ ఎస్ఐ మురహరి, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో శుక్రవారం రోడ్డు భద్రతా వారోత్సవాలు డీఎం నారాయణ స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం ఆర్టీసీ డ్రైవర్లకు డ్రైవింగ్‌లో పాటించాల్సిన మెలకువలను తెలియజేశారు. ఎస్ఐ శ్రీనివాసులు, ఎస్టీఐ వరప్రసాద్, ట్రాఫిక్ కంట్రోలర్ ఆసేని తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

శింగనమల: గురుగుంట్లలో శనివారం సాయంత్రం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు సర్పంచ్ వెంకట్రాముడు తెలిపారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

రేపు వైద్యశిబిరం

గుంతకల్లుటౌన్: రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం స్థానిక రోటరీ హైస్కూల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రోటరీ క్లబ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు ప్రదీప్, డిష్ రాము శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతపురం సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ నిపుణుడు ప్రణీత్‌రెడ్డి ప్రజలకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

మురుగునీటి సమస్య పరిష్కరించండి

గార్లదిన్నె: యర్రగుంట్లలో మురుగు నీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు శుక్రవారం ఎంపీడీఓ విజయభాస్కర్‌కు విన్నవించారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో మురుగునీరు కాలువ నిండి ప్రధాన రోడ్లపై వెళ్తుండడంతో ఇబ్బంది ఉందన్నారు. స్పందించిన ఎంపీడీఓ వారం రోజుల లోపు సమస్య పరిష్కరిస్తామన్నారు. రాయలసీమ రైతు సంఘం నాయకులు అక్బర్, ఖాదర్ బాషా, చౌడమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

పామిడి: కోనేపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన పాఠశాల రికార్డులు, హాజరు పట్టికను పరిశీలించారు. విద్యార్థుల విద్యాప్రగతిపై సమీక్షించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై సంతృప్తి వ్యక్తంచేశారు. మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం కింద రూ.3 లక్షలతో పాఠశాల భవనం మరమ్మతులు చేపడుతున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

కోనేపల్లి వంకలో రోడ్డు పునరుద్ధరణ



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్

పామిడి: కోనేపల్లి సమీపంలో పెన్నానది నీటి ప్రవాహంతో రోడ్డు తెగిపోయి పెనకచెర్ల గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. కోనేపల్లి హైస్కూల్, బీఈడీ విద్యార్థులు విద్యనభ్యసించాలంటే పెనకచెర్లకు వెళ్లాల్సి ఉంది. అయితే రాకపోకలు స్థంభించడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి తక్షణం స్పందించారు. మండల పరిషత్ 15వ ఫైనాన్స్ నిధులు రూ.3 లక్షలతో నదీనీరు వెళ్లేందుకు పైపులు ఏర్పాటు చేయించి రాకపోకలు పునరుద్ధరించారు. కోనేపల్లి గ్రామస్తులు, విద్యార్థులు ఎమ్మెల్యే వైవీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉండగా పూర్తయిన రోడ్డు పనులను ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్ శుక్రవారం పరిశీలించారు. ఎమ్మెల్యే వైవీఆర్ చొరవతో ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి సహకారంతో పనులను పూర్తి చేసినట్లు ఈసందర్భంగా ఎంపీడీఓ తెలిపారు.

ఘనంగా మారెమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎంపీపీ బొంబాయి ఉమాదేవి దంపతులు

యాడికి: మండలకేంద్రంలో కమలపాడు రహదారిలో వాటర్ ట్యాంకు వద్ద శుక్రవారం మారెమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన ఘనంగా నిర్వహించారు. దాతలు, గ్రామస్తుల సహకారంతో కొత్తగా మారెమ్మ తల్లి ఆలయం నిర్మించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక హోమాలు, పూజలు చేశారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. ఎంపీపీ బొంబాయి ఉమాదేవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు దంపతులు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు, రామ్మోహన్, వార్డు సభ్యులు రామచంద్ర, బాల పెద్దయ్య పాల్గొన్నారు. భక్తులకు ఆయ కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



టీడీపీ వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

శింగనమల: చిన్నజలాలపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు నరసింహులు, పెద్దన్న, కాంతమ్మ, ఆదెప్ప, లక్ష్మీదేవి, కామన్న, బాలప్ప, బి.నరసింహులు, రాజన్న, కే.నరసింహులు కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వారు తెలిపారు.

మహిళా కూలీకి గాయాలు

పామిడి: పాళ్యంతండా గ్రామానికి చెందిన మహిళా కూలీ కృష్ణమ్మబాయి కిందపడి గాయపడింది. వివరాలు.. ఉపాధి హామీ పనుల్లో భాగంగా శుక్రవారం ఆమె కొండల్లో కందకం తవ్వకం పనికి వెళ్లింది. పనిచేస్తున్న ప్రాంతంలో జారీ కిందపడింది. ఈ ప్రమాదంలో నడుం విరిగింది. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ ఆమెను హుటాహుటినా స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం ఎంపీడీఓ 108 వాహనంలో అనంతపురం సర్వజనాసుపత్రికి పంపారు.

రేపు టాలెంట్ టెస్ట్

తాడిపత్రి టౌన్ : స్థానిక కడప రోడ్డు టెక్ జూనియర్ కళాశాలలో ఆదివారం ఉదయం 10 గంటలకు టెన్త్ విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ అశోక్‌కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ రామాంజనేయులు తెలిపారు. ప్రతిభ కనబరచి మొదటి 15 మంది విద్యార్థులకు క్యాష్, మెరిట్ ప్రశంసాపత్రాలతో ఉచితంగా ఇంటర్ చదివేందుకు అవకాశం కల్పిస్తామన్నారు.


ఘనంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్ట



వాల్మీకి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దవడుగూరు : మండల కేంద్రంలో శుక్రవారం వాల్మీకి విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వాల్మీకి విగ్రహానికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వాల్మీకి చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ ఎం. లిఖిత, మాజీ చైర్మన్ వీరాంజనేయులు, వాల్మీకి నేత కోనాపురం ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

పరమ సంస్థానంలో ప్రత్యేక పూజలు



యజ్ఞం చేస్తున్న భక్తులు

బుక్కరాయసముద్రం: సంజీవపురం గ్రామంలో పరమపిత వెంకట రమణాచార్య గురువు చారిటబుల్ ట్రస్ట్ 11వ ఆరాధనను పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరమ సంస్థానంలో పీఠాధిపతి యోగి ముక్తేశ్వరి మాతాజీ ఆధ్వర్యంలో 109 కలశాలు, 109 యజ్ఞ గుండాలతో 109 జంటలు యజ్ఞం నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

ఎలక్ట్రీషియన్, ప్లంబర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

తాడిపత్రి టౌన్ : తాడిపత్రి ఎలక్ట్రీషియన్, ప్లంబర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎంపిక చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు బాబా ఓ ప్రకటనలో తెలిపారు. నూతన అధ్యక్షుడిగా రవిశంకర్, ఉపాధ్యక్షుడిగా హుస్సేన్‌బాషా, సెక్రటరీగా అనిల్, జాయింట్ సెక్రటరీగా దాదు, కోశాధికారిగా రాములను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

విద్యార్థినులకు పరీక్ష సామగ్రి పంపిణీ

తాడిపత్రి టౌన్: స్థానిక పుట్లూరు రోడ్డులోని కస్తూర్బా బాలికా విద్యాలయంలో 10వ తరగతి చదువుతున్న 40 మంది విద్యార్థినులకు శుక్రవారం ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవా సమితి సభ్యులు పరీక్ష ప్యాండ్, పౌచు, పెన్నులు పంపిణీ చేశారు. ఏప్రిల్‌లో పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న దృష్ట్యా విద్యార్థినులకు పరీక్ష సామగ్రి అందించినట్లు సేవా సంఘ అధ్యక్షుడు శ్రీహరి, కన్వీనర్ శ్రీరంగయ్య, ప్రధాన కార్యదర్శి శంకర్ తెలిపారు. సంస్థ కన్వీనర్ చెన్నకేశవులు, సి.రంగయ్య, మహిళ అధ్యక్షురాలు విజయలక్ష్మి, సంయుక్త కార్యదర్శి గుర్రప్ప, ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, నాగభూషణరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ కూల్చివేతపై పోలీసులకు ఫిర్యాదు

గుత్తి: తమ స్థలం చుట్టూ నిర్మించుకున్న ప్రహరీని బాషా అనే వ్యక్తి అర్ధరాత్రి సమయంలో జేసీబీతో కూల్చివేశారని పట్టణానికి చెందిన ట్రాక్టర్ హుస్సేనప్ప, ఆయన కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి వివరాల మేరకు..పట్టణ శివారులోని అనంతపురం రోడ్డులోని సర్వే నంబర్ 353–సి కుటుంబ సభ్యులకు మొత్తం 43 సెంట్ల స్థలం ఉంది. స్థలం పక్కనే బాషా అనే వ్యక్తికి చెందిన స్థలం ఉంది. అయితే బాషా దౌర్జన్యంగా ఆ స్థలంలో కొంత భాగాన్ని ఆక్రమించాడు. దీంతో వారు గతంలోనే పోలీసులను ఆశ్రయించి అన్ని రకాల డాక్యుమెంట్లను చూపించారు. అయినా బాషా వారిపై గొడవకు దిగుతూనే ఉన్నాడు. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం సుమారు రూ.1.30 లక్షలు వెచ్చించి స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించుకున్నారు. అయితే గురువారం అర్ధరాత్రి బాషా తన మనుషులతో వచ్చి జేసీబీతో ప్రహరీ కూల్చివేశారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.